క్లుప్తంగా

కుళ్లాయిస్వామి సేవలో ఎంపీ రంగయ్య


గూగూడులో కుళ్లాయిస్వామిని దర్శించుకుంటున్న ఎంపీ తలారి రంగయ్య

నార్పల: మండల పరిధిలోని గూగూడు కుళ్లాయి స్వామి, ఆంజనేయ స్వామిని సోమవారం ఎంపీ తలారి రంగయ్య దర్శించుకున్నారు. ఈనెల 19 నుంచి గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామంలోని పరిసరాలను పరిశీలించారు. అనంతరం దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ మెంబర్లతో సమావేశమయ్యారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ రమణకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


గురునాయక్

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థి దుంగావత్ గురునాయక్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి సోమవారం తెలిపారు. గురునాయక్‌కు మంచి మార్కులు రావడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు దక్కినట్లు పేర్కొన్నారు.

టెన్త్ టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు


విద్యార్థులకు నగదు అందజేస్తున్న రిటైర్డ్ ఎంఈఓ కేశవరెడ్డి

పెద్దపప్పూరు: మండలంలోని పెద్దయక్కలూరు జెడ్పీహెచ్ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రిటైర్డు ఎంఈఓ నందవరం కేశవరెడ్డి నగదు బహుమతులు అందజేశారు. పవన్‌కుమార్‌కు రూ.5 వేలు, ఆర్.గౌతమి రూ.3 వేలు, దీవెనరాజుకు రూ.2 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీదేవి, ఓబుళపతి, హెచ్ఎం కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే సన్న బియ్యం సరఫరా


లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న తహసీల్దార్ మునివేలు, కమిషనర్ జి.రవి

తాడిపత్రి అర్బన్: బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో తక్కువ ధరకే సన్న (సోనా మసూరి) బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ మునివేలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయ సమీపంలోని ఎఫ్‌పీ దుకాణం వద్ద బియ్యం పంపిణీ కేంద్రాన్ని తహసీల్దార్ మునివేలు, కమీషనర్ జి.రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ.. కిలో బియ్యం రూ.48, కిలో కందిపప్పు రూ.130 చొప్పున ప్రభుత్వం రాయితీతో ఒక రేషన్ కార్డుకు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ రాజా, రైస్ మిల్లర్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న అధికారులు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడామైదానంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రైల్వే ఉద్యోగుల, కార్మికుల క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. సీఎండబ్ల్యూ డీఎంఈ అఖిల్ పల్లి క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంఈ మాట్లాడుతూ.. రైల్వేలోని అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులు, అధికారులు, కార్మికులు ఈ టోర్నీలో పాల్గొంటారన్నారు. ఈనెల 25వ తేదీ వరకూ టోర్నీ జరుగుతుందన్నారు. టోర్నీలో విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రెటరీ రవి కుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్ రామాంజనేయులు, డీజిల్ బ్రాంచ్ ఎస్‌సీఆర్‌ఎంఎంయూ సెక్రెటరీ రామాంజనేయులు రెడ్డి, ఎస్సీ అండ్ ఎస్టీ సెక్రెటరీ రామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

ఆపదలో నేనున్నానంటూ..

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఓబుళరాజు. యాడికి మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాలనీకి కరోనా మొదటి కేసు నమోదైన సమయంలో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కరోనా సోకిన వ్యక్తిని బత్తలపల్లి ఆసుపత్రికి తరలించారు. వారి కుటుంబ సభ్యులను క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. కాలనీని రెడ్‌జోన్‌గా ప్రకటించిన సమయంలో వలంటీర్ ఓబుళరాజు ధైర్యంగా సేవలందించేందుకు ముందుకొచ్చాడు. తన పరిధిలోని ఇళ్లకు వెళ్లి ప్రజలకు ధైర్యం చెప్పాడు. కరోనాపై అవగాహన కల్పించాడు. పాలు, పెరుగు, కూరగాయలు కొనుగోలు అందజేసి, మానవత్వం చాటుకున్నాడు. అలాగే లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుని, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పథకాలు అందేలా చూస్తున్నాడు. లబ్ధిదారుల కుటుంబంలో ఒక్కడిగా మారి సేవలు అందిస్తున్నాడు. – యాడికి


రెడ్‌జోన్ ప్రాంతంలోని బాధితులకు పాలు, కూరగాయలు తీసుకెళ్తున్న వలంటీర్ ఓబుళరాజు (ఫైల్)

ఓబుళరాజు సేవలు సూపర్..



కరోనా కేసులు నమోదైనప్పుడు మా కాలనీని అధికారులు రెడ్‌జోన్‌గా ప్రకటించారు. ఆ సమయంలో వలంటీర్లు చేసిన సేవలు అమోఘం. కరోనాకు భయపడి ఎవ్వరూ బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వలంటీర్ ఓబుళరాజు అండగా నిలిచాడు. సమస్యను చెప్పిన వెంటనే సేవలు అందించాడు. మందులు, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించాడు. వలంటీర్ ఓబుళరాజు చేసిన సేవలు మా కాలనీ వాసులకు జీవితాంతం గుర్తుండి పోయాయి. – పెద్దరాజు, విశ్రాంత తపాలా ఉద్యోగి, యాడికి

ఆకలితో అలమటించకూడదని..

కరోనా కష్టకాలంలో వలంటీర్లు ధైర్యంగా సేవలందించారు. ప్రజల బాగోగుల కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పని చేశారు. రక్తసంబంధీకులు సైతం పరామర్శించ లేని పరిస్థితుల్లో వలంటీర్లే దేవుళ్ల మాదిరిగా సపర్యలు చేశారు. పామిడిలోని మదీనా ఏరియా–2 సచివాలయ పరిధిలోని 15వ వార్డు వలంటీర్లు జె.మనోహర్, కె.మసూద్‌వలి కరోనాకు భయపడకుండా విశిష్ట సేవలందించారు. కరోనా బాధితులకు నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు. అలాగే ఎఫ్‌పీ షాపు–5 డీలర్‌కు కరోనా సోకడంతో ఆయన క్వారైంటన్‌కు వెళ్లారు. ఆ సమయంలో స్థానికులకు ఇబ్బంది కలగకుండా వారే ఎఫ్‌పీ షాపు–5లో రేషన్ పంపిణీ చేశారు. – పామిడి


కరోనా ఫస్ట్ వేవ్‌లో ఎఫ్‌పీ షాపు–5లో ప్రజలకు రేషన్ వేస్తున్న వలంటీర్లు (ఫైల్)

కరోనాలో వలంటీర్లే రేషన్ వేశారు..



నేను పామిడి ఎఫ్‌పీ షాపు–5 డీలర్‌ను. మొదటి కరోనా వేవ్‌లో నాకు కరోనా సోకింది. 14 రోజులు క్వారైంటైన్‌లో ఉండాల్సి వచ్చింది. అప్పట్లో కరోనా సోకిందంటే ఓ విద్రోహశక్తిగా చూసేవారు. అలాంటి తరుణంలో వలంటీర్లు జె.మనోహర్, కె.మసూద్‌వలి సరుకులు అందజేసేందుకు ముందుకొచ్చారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజా పంపిణీ వ్యవస్థను కొనసాగించారు. ఆ వలంటీర్ల సాయం ఎన్నటికీ మరువలేం. – కె.నారాయణమూర్తి, రేషన్ డీలర్, పామిడి

మందులు అందుబాటులో ఉంచాలి

గుంతకల్లుటౌన్: హీమోఫిలియా వ్యాధితో బాధపడుతున్న తమకు ఫ్యాక్టర్–8, 9 ఇంజక్షన్లను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో ఉంచాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌ను వ్యాధిగ్రస్తులు కోరారు. ఇంజక్షన్ల కోసం ప్రతి నెలా అనంతపురం ప్రభుత్వాస్పత్రి లేదా బెంగళూరులో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా మారిందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌రషీద్, షేక్షావలి, అమర్‌నాథ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

గుత్తి రూరల్: విత్తన శుద్ధి చేసి పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడు, వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్ సూచించారు. సోమవారం లచ్చానుపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వేరుశనగ విత్తనాలను శుద్ధి చేయించి పంట సాగు చేయించారు. అనంతరం 30 మంది రైతులకు పంట పెరుగుదల, ఆరోగ్య పరిస్థితి, ఎరువులు, పురుగు మందు వాడకం, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణ భగవాన్, ఆర్‌బీకే ఇన్‌చార్జ్ జగదీష్ పాల్గొన్నారు.

జగనన్నను ఆశీర్వదించాలి


మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని తదితరులు

గుంతకల్లుటౌన్: సంక్షేమ సారథి, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ప్రజలను కోరారు. సోమవారం పట్టణంలోని 8, 9, 36 వార్డుల కౌన్సిలర్లు అరుణ, రవీంద్ర, కుమారి ఆధ్వర్యంలో ఆయా సచివాలయాల వద్ద జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహించారు. ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. రానున్న రోజుల్లో పేదరిక నిర్మూలన, రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున, అసిస్టెంట్ కమీషనర్ లావణ్య, ఆర్ఓ నాసిర్‌హుసేన్, మెప్మా టీపీఆర్ఓ మోహన్, సీఎంఎం భవాని, మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజినేయులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, సచివాలయాల కన్వీనర్ ఎండీ.ఖలీల్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి


గుంతకల్లు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ డీఈ విజయ భాస్కర్ రావు మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 9,662 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో దాదాపు 2,810 ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లు వెల్లడించారు. మిగిలిన ఇళ్లు ఆర్‌సీ, రూఫ్‌లెవల్‌తో పాటు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు ఇప్పటి వరకూ రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల సాకారం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. సొంత స్థలాలు ఉంటే ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక స్తోమత లేని వారు చాలామంది ఇళ్ల నిర్మాణాలకు ఆసక్తి చూపుతున్నారన్నారు. మీ పరిధిలోని అలాంటి వారిని గుర్తించి ఒక నివేదక తయారు చేసి ఇవ్వాలన్నారు. ఈ విషయాన్ని మంత్రులు, పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈలు మారుతి (గుంతకల్లు అర్బన్), సంపత్ కుమార్ (గుంతకల్లురూరల్), సూర్య (గుత్తి), వెంకటేశ్వర్లు (పామిడి), వర్క్‌ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

గుంతకల్లు: అంతర్జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో రాణించాలని క్రీడాకారిణి కరిష్మాకు ఎమ్మెల్యే వైవీఆర్ సూచించారు. కర్ణాటకలోని శివమొగ్గలో ఈనెల 7,8,9 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో గుత్తి పట్టణానికి చెందిన కరిష్మా 42 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించింది. సోమవారం కరిష్మా గుంతకల్లులో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తైక్వాండో పోటీల్లో కాంస్య పతకం సాధించడం హర్షణీయమన్నారు. తల్లితండ్రులతో పాటు పుట్టిన ఊరుకి గుర్తింపు తీసుకొచ్చిందని కొనియాడారు. మరిన్ని విజయాలు సాధిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.

విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం

గుత్తి రూరల్: మండలంలోని మార్నేపల్లికి చెందిన అఖిల అనే యువతి ఉన్నత చదువులకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సోమవారం ఆర్థికసాయం అందజేశారు. అఖిల అనంతపురంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఫీజు చెల్లించక పోవడంతో ఇంట్లోనే ఉండిపోయింది. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేను విద్యార్థిని అఖిల కలిసింది. ఆర్థికసాయం చేయాలని ఎమ్మెల్యేని వేడుకుంది. స్పందించిన ఎమ్మెల్యే వారిని గుంతకల్లు పట్టణానికి పిలిపించి రూ.10 వేల సాయం అందించారు.

చౌడేశ్వరీ దేవికి పూజలు


పెద్దవడుగూరు: క్రిష్టిపాడులో బోనాలు తీసుకెళ్తున్న భక్తులు


యాడికి: అలంకరణలో చౌడేశ్వరీ దేవి

యాడికి/పెద్దవడుగూరు/పుట్లూరు/శింగనమల: గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో సోమవారం చౌడేశ్వరీ జయంతిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయాల్లో అభిషేకం, అర్చనలు చేసి వివిధ రకాల పూలతో అలంకరించారు. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడులో భక్తులు బోనాలు ఊరేగించారు. శింగనమలలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, అలయ కమిటీ సభ్యులు వాసు, మధు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొలంబస్



గుత్తి: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కొలంబస్ ఎంపికయ్యారు. అదే విధంగా జిల్లా గౌరవాధ్యక్షుడిగా గుత్తికే చెందిన కంబగిరి రాముడు ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చంద్రశేఖర్‌రెడ్డిని ఎంపిక చేస్తూ వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌చార్జ్ ఎంపీపీగా రామిరెడ్డి

పెద్దపప్పూరు: పెద్దపప్పూరు ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి ఇటీవల తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లెటర్‌ను జిల్లా పరిషత్ అధికారులకు అందజేసిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారులు రాజీనామాను ఆమోదించారు. ఎంపీపీ స్థానం ఖాళీగా ఉండటంతో సోమవారం జిల్లా పరిషత్ అధికారులు వైస్ ఎంపీపీగా ఉన్న బొందలదిన్నె రామిరెడ్డికి ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రామలింగేశ్వరుడికి నేరేడు పండ్లతో అభిషేకం



తాడిపత్రి అర్బన్: సోమావతీ అమావాస్యను పురస్కరించుకుని సోమవారం బుగ్గ రామలింగేశ్వర స్వామిని నేరేడు పండ్లతో అభిషేకించారు. మహా గణపతి పూజ, పంచామృతాభిషేకం, వివిధ రకాల పండ్ల రసాలతో మూలవిరాట్‌ను అభిషేకించారు. పంచహారతులు, మహా మంగళహారతి నిర్వహించిన అనంతరం భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

డ్రైనేజీ క్లీనింగ్ మిషన్ అందజేత


సిద్దరాచర్లలో డ్రైనేజీ క్లీనింగ్ మిషన్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నార్పల: మండల పరిధిలోని సిద్దరాచర్లకు చెందిన మారెప్పకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ద్వారా మంజూరైన డ్రైనేజీ క్లీనింగ్ మిషన్‌ను సోమవారం ఎంపీపీ నాగేశ్వరావు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం సీఎం జగన్ పలు పథకాలు ప్రవేశపెట్టారన్నారు. సబ్సిడీపై వాహనాలు అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజినేయులు, ఎంపీటీసీ శంకర్‌యాదవ్, ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పెద్దవడుగూరు: మండల పరిధిలోని క్రిష్టిపాడు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రంగనాయకులు, రామన్న వర్గాలకు ఇంటి స్థలం విషయంలో వివాదం నెలకొంది. దీంతో ఇరువర్గాల వారు పరస్పరం దాడులకు తెగబడ్డారు. రంగనాయకులుపై శ్రీకాంత్ కత్తితో దాడి చేయడంతో.. అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే ఈ ఘర్షణలో శ్రీకాంత్, కుమార్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి

పెద్దవడుగూరు: కొండుపల్లి సమీపంలోని మైనింగ్ గని వద్ద సోమవారం ఓ కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. యాడికి మండలం తూట్రాలపల్లికి చెందిన నల్లబోతుల సుబ్బారాయుడు కొండుపల్లిలోని మైనింగ్ గనిలో పని చేస్తున్నాడు. తీవ్ర అస్వస్థతకు గురైన సుబ్బరాయుడు.. మూత్రం పోసేందుకు వెళ్లి పక్కనే ఉన్న గుంతలో పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు సుబ్బారాయుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

రేపు సీసీ రోడ్ల ప్రారంభోత్సవం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

పామిడి: పట్టణంలోని వీకే ఆదినారాయణరెడ్డి కాలనీ, గుప్తా కాలనీ, నెహ్రూ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఈనెల 19వ తేదీన ప్రారంభిస్తున్నట్లు మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.మధుసూధన్‌రెడ్డి తదితరులు తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీసీ రోడ్ల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి, కలెక్టర్ గౌతమి హాజరవుతారన్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పామిడి మండల అభివృద్ధిలో ఎమ్మెల్యే వైవీఆర్ కృషి అమోఘమన్నారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సచివాలయాల కన్వీనర్లు బి.అసిఫ్, ఎం.కుమార్ రెడ్డి, పార్టీ మండల నాయకులు, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, జోజుడే కుమార్, అబ్దుల్ రజాక్, అబుసాలేహా, సునీల్‌రెడ్డి, పార్వతీశ్వర్ రెడ్డి, ఆదామ్, నక్కా ఓబులేసు, శీన, నాగభూషణ్ రావు, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

తేనెటీగల దాడిలో కూలీకి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని ధర్మాపురం శివారులోని ఓ తోటలో సోమవారం తేనెటీగల దాడిలో కూలీ గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ధర్మాపురం గ్రామానికి చెందిన రంగస్వామి గ్రామ శివారులోని ఓ తోటలో వ్యవసాయ కూలీ పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో తోటలో పనిచేస్తున్న కూలీ రంగస్వామిపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన అతడ్ని తోటి కూలీలు చికిత్స నిమిత్తం వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించాలని వైద్యులు సూచించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తికి..


గాయపడిన నరసింహులు

పెద్దవడుగూరు: ముప్పాలగుత్తి గ్రామంలో సోమవారం విద్యుత్‌షాక్‌తో క్రిష్టిపాడు గ్రామానికి చెందిన నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ఎస్సీ కాలనీలో యల్లమ్మ దేవాలయాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణంలో భాగంగా సోమవారం ఆలయ పై కప్పు వేయడానికి కూలీలను క్రిష్టిపాడు నుంచి పిలిపించారు. పనులు చేస్తుండగా.. పై భాగంలో ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు నరసింహులుకు తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడ్ని 108లో అనంతపురం తరలించారు. గ్రామంలో పలుచోట్ల ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాక్టర్ ఎక్కుతూ కిందపడిన ఘటనలో..

గుత్తి రూరల్: మండలంలోని ఎంగిలిబండ గ్రామ శివారులో సోమవారం ట్రాక్టర్ ఎక్కుతూ ప్రమాదవశాత్తూ కాలుజారి కింద పడటంతో కృప అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఎంగిలిబండ గ్రామానికి చెందిన కృప అనే యువకుడు గ్రామ శివారులో నడిచి వెళ్తున్నాడు. గ్రామానికి వెళ్తున్న క్రమంలో అటుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపాడు. డ్రైవర్ ఆపగా.. ట్రాక్టర్ ట్రాలీ ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు చేయి జారి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కృపను వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సలకు అనంతపురంకు తరలించాల్సిందిగా వైద్యులు సూచించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పడంతో వ్యక్తికి..


తీవ్రంగా గాయపడిన హరి

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో దిల్కా శీనా పెట్రోల్ బంక్ వద్ద సోమవారం బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బైక్‌లో ప్రయాణిస్తున్న హరి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ఎస్‌ఎస్ పల్లికి చెందిన బేల్దారి హరి పని మీద ద్విచక్ర వాహనంలో పెద్దవడుగూరు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి బైక్‌లో ఎస్‌ఎస్ పల్లికి బయలుదేరాడు. అయితే గుత్తి పట్టణ శివారులో బైక్ అదుపు తప్పడంతో హరి కిందపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడ్ని 108లో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామంలో సోమవారం వ్యవసాయ పొలంలో పనులు చేస్తున్న భారతి అనే మహిళకు పాముకాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భారతి గ్రామ శివారులో ఉన్న తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తోంది. పాముకాటు కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆమెను వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం సర్వజనాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.